2034 వరకు కాంగ్రెస్‌దే అధికారం

- చంద్రబాబు, వైఎస్ అభివృద్ధి విధానాలు కొనసాగిస్తున్నాం
- అన్ని రంగాల్లో కెసిఆర్ ప్రభుత్వం విఫలం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2034వరకు అధికారంలో ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

మాజీ సిఎంలు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. ఐటీ, ఫార్మా రంగాలను వారు ఎంతో ప్రోత్సహించారని చెప్పారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

"జిసిసిలు, డేటా సెంటర్లకు హైదరాబాద్ హబ్‌గా మారింది. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి పునాది వేసిన ఐటీ రంగం నగర అభివృద్ధికి కీలకంగా మారింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ కూడా కీలకంగా మారాయి. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల నిర్ణయాలు హైదరాబాద్ అభివృద్ధికి

మీట్‌ది ప్రెస్‌లో రేవంత్ రెడ్డి

బాటలు వేశాయి. గతంలో కాంగ్రెస్ హయాంలోనే అనేక కేంద్ర సంస్థలు నగరంలో ఏర్పాటయ్యాయి. దేశానికి వచ్చిన వాటిలో 70 శాతం ఇక్కడికే వచ్చాయి. ప్రపంచాన్నే శాసించే సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. నగరం నాలెడ్జ్ సిటీగా మారిందంటే అందుకు గతంలో కాంగ్రెస్ సీఎంలు తీసుకున్న నిర్ణయాలే కారణం. అభివృద్ధి మాత్రమే కాదు.. సంక్షేమంలోనూ వారు తమదైన ముద్ర వేశారు. 2004-2014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వాలు కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉంటూ హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేశాయి.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో త్యాగాలు చేసింది. ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి 4 కోట్ల మంది ప్రజలకు ఇచ్చింది. బిఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారు. వ్యవసాయం, విద్య, వైద్యం.. ఇలా అన్ని రంగాల్లోనూ విఫలమయ్యారు. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా? కాళేశ్వరం లేకుండానే మా ప్రభుత్వం అత్యధికంగా వరి పంటను ఉత్పత్తి చేసింది. గత పాలకులు ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా? కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులన్నీ పెండింగులోనే పెట్టారు. ఎలాంటి ప్రయోజనం లేని కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రగతిభవన్, సచివాలయం మాత్రమే కేసీఆర్ పూర్తిచేశారు.

కెటిఆర్ అరెస్ట్‌కు గవర్నర్ అనుమతివ్వలేదు

కేటీఆర్ జీవితంలోనే అధికారం అనే రేఖ లేదు. కుమారుడి విషయంలో కెసిఆర్ ధృతరాష్ట్రుడిలా మారారు. కేటీఆర్ దశే బాగాలేకపోతే కెసిఆర్ ఎన్ని దిశలు మార్చినా ఏం లాభం? కెటిఆర్ ఎన్నికల ప్రచారం పుష్ప సినిమాలో శ్రీలీల ఐటమ్‌సాంగ్‌ను గుర్తుకు తెస్తోంది. 3 నెలలు అవుతున్నా కేటీఆర్ అరెస్ట్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వలేదు. కెసిఆర్ పెట్టిన ఏ పథకాన్ని కూడా నేను రద్దు చేయలేదు. వాటిని కొనసాగిస్తూ అదనంగా అనేక కొత్తపథకాలు తీసుకొచ్చాను. ఎస్‌సి వర్గీకరణపై ఎవరూ చేయని సాహసం చేశాను. వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలిపాను. దేశంలో ఎవరూ చేయని కులగణనను రాష్ట్రంలో చేసి చూపించాను. తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించాను. మహిళలకు ఉచిత ప్రయాణం సహా అనేక ఎన్నికల హామీలు నెరవేర్చాను.

బిజెపికి డిపాజిట్ వస్తే దేశం మొత్తం గెలిచినట్లే

రాష్ట్రానికి వచ్చిన కంపెనీలు గుజరాత్ తరలి వెళ్లేందుకు బిజెపి నేతలు కృషి చేస్తున్నారు. సెమీ కండక్టర్ల కంపెనీ ఆ రాష్ట్రానికి తరలించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి యత్నిస్తున్నారు. బిఆర్ఎస్ బిజెపిది ఫెవికాల్ బంధం. కాళేశ్వరం విచారణను సిబిఐకి అప్పగించాం. ఇప్పటి వరకు విచారణ ఎందుకు ప్రారంభించలేదు? జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో డిపాజిట్ తెచ్చుకుంటే బిజెపి దేశం మొత్తం గెలిచినట్లే. మరో ఎనిమిదేళ్లు మేమే అధికారంలో ఉంటాం. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావు. 2029 జూన్‌లో జమిలి ఎన్నికలు వస్తాయి. 2034 జూన్ వరకూ కాంగ్రెస్సే అధికారంలో ఉంటుంది. సొంత చెల్లిని, మాగంటి తల్లిని మోసం చేసినవారు రాష్ట్రానికి ఏం న్యాయం చేస్తారు "అని రేవంత్ అన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జూలకంటి

ఎర్రజెండాతోనే ప్రజా సమస్యల పరిష్కారం : జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే అది కమ్యూనిస్టు ప్రభుత్వాల ద్వారా మాత్రమే సాధ్యమైతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామంలో సిపిఎం మాజీ మండల కమిటీ సభ్యులు బొంగరాల వెంకన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థూపావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొంగరాల వెంకన్న ఉట్లపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పార్టీ నిర్మాణం కోసం అహర్నిశలు పాటు పడ్డారన్నారు. ఆయన సేవలను నేటి తరం గుర్తుంచుకొని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. పాలకులు ప్రజా సమస్యలు పరిష్కారంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలకు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత వాటిని ప్రభుత్వం మరిచిందన్నారు. వీటిని ప్రజలు గమనిస్తున్నారని, సిపిఎం చేసే పోరాటాల్లో భాగస్వాములై ప్రజాఉద్యమాలకు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, జిల్లా కమిటీ సభ్యులు చౌగాని సీతారాములు, మండల కమిటీ సభ్యులు నాగ్‌హుస్సేన్, కన్నెగంటి రామకృష్ణ, చౌగాని వెంకన్న, జిల్లానగేష్, బొంగరాల వెంకన్న కుమారులు హరి, విజయ్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

టెలివిజన్ కార్మికులకు అండగా ఉంటాం

- తెలంగాణ టెలివిజన్ డెవలప్‌మెంట్ ఫోరం ఆత్మీయ సమ్మేళనలో మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

టెలివిజన్ కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. వారి సమస్యలు పరిష్కరించి, అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆదివారం బేగంపేట్‌లోని హరిత ప్లాజా హెూటల్‌లో 'తెలంగాణ టెలివిజన్ డెవలప్‌మెంట్ ఫోరం' ఆధ్వర్యంలో నిర్వహించిన 'కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఎంటర్‌టైన్‌మెంట్ రంగం కీలక చోదక శక్తిగా మారిందని, ప్రేక్షకులకు నిరంతరం వినోదాన్ని అందించేందుకు టెలివిజన్ కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ రంగంలో పనిచేసే ప్రతి ఒక్కరూ ప్రాజెక్ట్ సక్సెస్ కోసం కష్టపడతారని, వారి త్యాగం వెలకట్టలేనిదని ప్రశంసించారు. రాష్ట్రంలో టెలివిజన్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, కార్మికుల ఆర్థిక, సామాజిక భద్రతా సమస్యలపై తమ ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందన్నారు. వీటి పరిష్కారం కోసం సిఎం రేవంత్‌రెడ్డి అత్యంత సానుకూలంగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, సంఘం ప్రతినిధులు సురేష్, కవిత పాల్గొన్నారు.

గోపీనాథ్ మరణం మిస్టరీగా అనిపిస్తోంది

- ఆయన తల్లి మహానంద కుమారి సంచలన వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై ఆయన తల్లి మహానంద కుమారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గోపీనాథ్ మరణం మిస్టరీగా అనిపిస్తోందన్నారు. ఆయన ఎప్పుడు చనిపోయారన్నది తల్లిగా తనకే తెలీదన్నారు. 'జూన్ 6న చనిపోయారా.. 8న చనిపోయారా?' అన్నదీ సందేహంగానే ఉందన్నారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాగంటి మొదటి భార్య మాలిని, ఆమె కుమారుడు తారక్‌తో కలిసి మహానంద కుమారి మీడియాతో మాట్లాడారు. "కెటిఆర్ వచ్చిన తర్వాత మరణవార్తను బయటకు చెప్పారు. గోపీనాథ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై గొప్ప పేరు తెచ్చుకున్నారు. అలాంటి వ్యక్తి ఆస్పత్రిలో ఉంటే.. ఒక్క రోజు కూడా చూడడానికి సమయం ఇవ్వలేదు. ఒక్క అటెండర్‌నైనా పెట్టలేదు. గోపీనాథ్ జూన్ 8న చనిపోయారని చెప్పారు. లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మొదటి భార్య, బిడ్డలు, నా పేరు కూడా లేదు. మొదటి భార్యతో విడాకులు కూడా కాలేదు. నేను గోపీనాథ్‌తో సునీత పెళ్లి చేయలేదు. ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో మా పేరు లేదు. కెటిఆర్ వెంట పరుగెత్తి నాకు జరిగిన అన్యాయం గురించి చెప్పాలి అనుకుంటే ఆయన కూడా వినలేదు. ఇది డబ్బు సమస్య కాదు. మాకు గుర్తింపు లేదు. అందుకే మీడియా ముందుకొచ్చాం. తల్లిగా ఎంతో బాధపడుతున్నా. సునీతకు టికెట్ ఇచ్చేటప్పుడు మాకు కనీసం సమాచారం ఇవ్వలేదు. గోపీనాథ్ మొదటి భార్య, కుమారుడికి గుర్తింపు ఉండాలి కదా. మాలిని ఎంతో బాధపడుతోంది. ఎన్నో అవమానాలు పడింది. వద్దు అనుకుంటే మొదటి భార్యతో ఎప్పుడో విడాకులు తీసుకునేవాడు. అలా జరగలేదు అంటే.. సాఫ్ట్ కార్నర్ ఉన్నట్లే కదా. నలుగురిలో నిరూపించుకోవాలనే బయటకు వచ్చాం. నా పెద్ద కొడుకు కూడా టికెట్ కోసం ప్రయత్నించాడు. గోపీనాథ్ తల్లిగా నాకు అడగాల్సిన హక్కులేదా? లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మా పేర్లు లేవని ఆగస్టు 11 నుంచి తహసీల్దార్ కార్యాయానికి వెళ్లి వస్తున్నాం. ఈ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు" అని అన్నారు.

మాకు గుర్తింపు లేదు : తారక్

తమకు లీగల్‌గా ఎలాంటి గుర్తింపు లేదని గోపీనాథ్ మొదటి భార్యకుమారుడు తారక్ ఆవేదన వ్యక్తం చేశారు. " తారక్ అంటే ఎవరో తెలియదన్న మాగంటి సునీత.. జూన్ 6న నాకు మొదటి సారి ఫోన్ చేశారు. ఎవరో తెలియకపోతే.. ఎందుకు ఫోన్ చేసినట్లు? గ్రాడ్యుయేషన్ డేకి రావాలని మా నాన్న అనుకున్నారు. కానీ, హఠాత్తుగా చనిపోయారు. సునీత నాకు ఫోన్ చేసి.. నువ్వు ఇండియా రావాల్సిన అవసరం లేదు. రెజ్యూమ్ పంపించు కెటిఆర్ అంకుల్ కంపెనీస్‌లో ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. మా పెద్దనాన్న మీద అనవసర ఆరోపణలు చేస్తున్నారు. జూన్ 25న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం అప్లై చేశారు. అప్పుడు అఫిడవిట్‌లో ఎవరి పేర్లు పెట్టారో నాకు తెలియదు. మా అమ్మ, నాన్నమ్మ, నా పేర్లను లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో పెట్టాలి" అని కోరారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వి కర్ణన్

జూబ్లీహిల్స్ బైపోల్‌కు అన్ని ఏర్పాట్లు

- అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ డ్రోన్లతో నిఘా
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వి కర్ణన్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ బైపోల్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. హైదరాబాద్ విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో 4,01,365 ఓటర్లు ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నారని.. ఓటర్లు ముందుకు వచ్చి ఓటెయ్యాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో మొత్తం 407 పోలింగ్ స్టేషన్లలో 226 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని అన్నారు. పోలింగ్‌ను డ్రోన్ల ద్వారా పరిశీలిస్తామని చెప్పారు. ఈ సారి నాలుగు బ్యాలెట్ యూనిట్లు వాడుతున్నామని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల దగ్గర సిసి కెమెరాలు అమర్చామని అన్నారు. 2,060 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో ఉండనున్నారని, 561 కంట్రోల్ యూనిట్లు, 595 వీవీ ప్యాట్స్, 2,394 బ్యాలెట్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోలింగ్ స్టేషన్స్ నుంచి వెబ్ కాస్టింగ్ లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్స్ దగ్గర హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నవంబర్ 11న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనున్నదని, పోలింగ్ స్టేషన్ల దగ్గర పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తామని తెలిపారు. నగర జాయింట్ సీపీ ఇక్బాల్ మాట్లాడుతూ.. నియోజకవర్గం వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎలక్షన్ కమిషన్ రూల్స్ ప్రకారం బందోబస్తు ఇస్తున్నామని చెప్పారు. సిఐఎస్ఎఫ్ నుంచి 8 కంపెనీల బలగాలు వచ్చాయన్నారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకుని ఓటు పండుగలో పాల్గొనాలని సూచించారు. జూబ్లీహిల్స్ బైపోల్ ప్రచారం సందర్భంగా మొత్తం 27 రకాల కేసులు నమోదయ్యాయని చెప్పారు. వీటిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.3.60 కోట్ల నగదు పట్టుకున్నామని చెప్పారు.



బిఆర్ఎస్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలి

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవపట్టిస్తున్న బిఆర్ఎస్ నాయకులు, ఆ పార్టీకి ఓటుతో గుణపాఠం చెప్పాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఎర్రగడ్డ డివిజన్‌లోని కల్యాణ్ నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వి నవీన్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డా .జివి వెన్నెల గద్దర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గల్లీ.. గల్లీ.. తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి, మంత్రి జూపల్లి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. స్థానికుడైన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కెసిఆర్ కుటుంబం లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక కష్టాల్లోకి నెట్టేసినా, రుణమాఫీ సహా ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామని తెలిపారు. యువకుడైన నవీన్ యాదవ్‌కు టికెట్ ఇచ్చి ప్రోత్సహిస్తుంటే బిఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 22 నెలలుగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధికి అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు హాజరయ్యారు.

మనసును తక్షణం రంజింపజేసేవి కళలు

- డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి

ప్రజాశక్తి కల్చరల్

సాహిత్యం అలోచనలు రేకెత్తించగా చూడగానే కళలు తక్షణం రంజుపజేస్తాయి అని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి అన్నారు. కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై మూడు రోజుల పాటు మ్యాజిక్ మిమిక్రి మైమ్ పెరిట జరిగిన మాయా వినోదం వేడుకల ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా డాక్టర్ నరసింహ రెడ్డి పాల్గొని మాట్లాడారు. మైమ్‌కు భాషా అవసరంలేదని, అన్ని ప్రాంతాల వారినీ ఆకట్టుకునే గొప్ప కళ కాగా మిమిక్రీ, మ్యాజిక్ కళలు ప్రేక్షకులను అచ్చెరువు కలిగిస్తాయని చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షుడు గుమ్మడి గోపాల కృష్ణ మాట్లాడుతూ విదేశాలలో రంగస్థల కళలు ఆదరణ ఉందని తెలుగు నాట ప్రేక్షకుల ఆసక్తి చూపక పోవడం కారణం ఏమిటి తెలుసుకోవాలి అన్నారు ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు మిమిక్రీ శ్రీనివాస్ మాటాడుతూ కళా కారులు పాత విధానం లోనే మరల మరల అవే ప్రదర్శన చేయటంతో ప్రేక్షకులకు దూరం అవుతున్నారని చెప్పారు. ఒక్క అంశం ఐనా ప్రతిభా వంతంగా అభ్యాసం చేసి ప్రదర్శించాలని పరిపక్వత లేకుండా చాలా అంశాలు ప్రదర్శించ రాదు అని సూచించారు. ప్రముఖ ఇంద్ర జాలికుడు సామల వేణు మాట్లాడుతూ మూడు కళలకు చెందిన గొప్ప కళ కారులను వొక చోట చేర్చి మెగా ప్రోగ్రాం నిర్వహించి కళాకారులకు ఉత్సాహం ఇచ్చిన కిన్నెర సంస్థ కృషి ప్రశంసనీయమన్నారు

కులరహిత సమాజం రావాలి

- సమాజాన్ని చైతన్యపర్చడంలో సహకరిస్తాం
- చయాన్-2025 జాతీయ సభలో జాన్‌వెస్లీ
- భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంది
- హైకోర్టు జడ్జి (రిటైర్డ్) రాధారాణి

సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మన దేశంలో కుల రహిత సమాజం రావాలనీ, ఆ దిశగా ప్రజలను చైతన్యపరిచ్చే ఉద్యమాలకు, పోరాటాలకు తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హామీనిచ్చారు. కుల, మతాంతర వివాహాలు చేసుకునే వారి కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలనీ, వారికి రక్షణ కల్పించే బాధ్యతను ప్రభుత్వాలు, పోలీసు యంత్రాంగం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 20కిపైగా సంఘాలు, సంస్థల భాగస్వామ్యంతో కూడిన చయాన్-2025 జాతీయ సభను కుల నిర్మూలన సంఘం అధ్యక్షులు ఎండి జావిద్, ప్రధాన కార్యదర్శి డిఎల్ కృష్ణ చంద్ అధ్యక్షతన రెండు సెషన్లలో నిర్వహించారు. ఆ సభలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ..కులాన్ని బట్టి మనుషులను గౌరవించే ధోరణి సమాజంలో ఇంకా ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మనుధర్మం కొనసాగాలనీ, కుల వ్యవస్థ బలపడాలని కోరుకునే వారు నేడు కేంద్రంలో పాలకులుగా ఉన్నారనీ, వారు వచ్చాక దాడులు మరింత తీవ్రం అయ్యాయని చెప్పారు. రాజ్యాంగం అందరికీ సమాన అవకాశాలు, గౌరవం వంటివి కల్పించినప్పటికీ ఆచరణలో వాటిని అమలు కాకుండా పాలకులు చూస్తున్నారని విమర్శించారు. హైకోర్టు జడ్జి(రిటైర్డ్) రాధారాణి మాట్లాడుతూ..జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉందనీ, రాజ్యాంగం సమానత్వ, జీవించే హక్కులను ప్రసాదించిన విషయాన్ని గుర్తుచేశారు. జస్టిస్ (రిటైర్డ్) రజిని మాట్లాడుతూ..మనుధర్మం సమానత్వాన్ని నిషేధించిందనీ, ఎక్కువ మంది దాని ప్రభావానికి లోనై కులాంతర వివాహాలు చేసుకునే వారిపై దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కులాలను బట్టి కాకుండా గుణాన్ని, వ్యక్తిత్వాన్ని చూసి గౌరవించే రోజులు రావాలని ఆకాంక్షించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షులు విమలక్క మాట్లాడుతూ..వనభోజనాలు కాస్త నేడు కుల భోజనాలు మారడటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. బహుజన బతుకమ్మ ద్వారా కులవ్యవస్థపై చేస్తున్న పోరాటాన్ని వివరించారు. ఈ సందర్భంగా 'ప్రేమ కరువాయే' సాంగ్‌ను ఆవిష్కరించి పాడారు. కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు టి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ... భారతీయ సమాజం కులాల దుర్గంధంలో కూరుకుపోయిందని విమర్శించారు. కులాంతర వివాహాలు చేసుకునే జంటల్లో ఒకరికి కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ఉద్యోగం ఇస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ఎంఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు బైరి నరేశ్ మాట్లాడుతూ. .మనుధర్మాన్ని ముందుకు తీసుకెళ్లేవారు ప్రతి చిన్న విషయాన్ని కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనీ, అదే మెరుగైన సమాజం కోరుకునేవారిలో మాత్రం ఐక్యత లోపిస్తున్నదని అభిప్రాయపడ్డారు. మార్క్స్, అంబేద్కర్‌లను చదివితే మన దేశంలో సామాజిక, ఆర్థిక ఐక్య పోరాటాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలనేది అర్థమవుతుందన్నారు. కుల నిర్మూలన సంఘం అధ్యక్షులు ఎండి జావిద్ మాట్లాడుతూ..ఒకప్పుడు ఉత్తర భారతంలో కుల దురంహకార దాడులు ఎక్కువగా ఉండేవనీ, ఇటీవల తెలంగాణలో కూడా 140 కుల దురంహకార హత్యలు జరగడం ఆందోళనకరమని చెప్పారు. ఇండియా లవ్ ప్రాజెక్టు నిర్వాహకులు ప్రియా రమణి అధ్యక్షతన రైట్ టూ చాయిస్ అనే అంశంపైనా, సీనియర్ జర్నలిస్టు కె.సజయ అధ్యక్షతన ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ అంశంపైనా చర్చా వేదికలు నిర్వహించారు. ఈ సభలో కుల నిర్మూలన సంఘం గౌరవాధ్యక్షులు గుత్తా జ్యోత్స్న, జెవివి జాతీయ అధ్యక్షులు ఎస్.స్వరాజ్య లక్ష్మి, ఎంవివి జాతీయ సంయుక్త కార్యదర్శి డి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులు పెట్టే ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

హైదరాబాద్ బ్యూరో : రోజూ రూ.కోట్ల విలువైన సైబర్ నేరాలు జరుగుతున్నాయని హైదరాబాద్ నగర సిపి సజ్జనార్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో సిటీ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన సైబర్ క్రైమ్ నియంత్రణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడుల పేరుతో చాలా యాప్‌ల్లో బాధితులు మోసపోతున్నారని పేర్కొన్నారు. డబ్బులు ఊరికే రావని.. పెట్టుబడులు పెట్టే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏపీకే ఫైల్స్ వల్ల కూడా మోసాలు జరుగుతున్నాయని వివరించారు. సైబర్ నేరాల్లో డబ్బు నష్టపోయిన వెంటనే బాధితులు 1930 నంబర్‌కు చేసి ఫిర్యాదు సూచించారు.

సైబర్ సెక్యూరిటీ బ్యూరో కీలక ఆపరేషన్

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో 5 రాష్ట్రాల్లో కీలక ఆపరేషన్ చేపట్టింది. సైబర్ నేరాలకు పాల్పడుతున్న 81 మందిని ఎపి, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటకలో పోలీసులు అరెస్టు చేశారు. నిందితులపై దేశవ్యాప్తంగా 754 కేసులు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం రూ.95 కోట్ల విలువైన మోసాలు చేసినట్లు గుర్తించారు. నిందితుల్లో 17 మంది ఏజెంట్లు, 7గురు మహిళలున్నారు. 58 మంది మ్యూల్ ఖాతాదారులున్నట్లు గుర్తించారు. వారి నుంచి 84 సెల్‌ఫోన్లు, 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల ఖాతాలోని రూ.కోట్ల నగదును ఫ్రీజ్ చేశారు.

కొల్లూరు కాలనీవాసుల సమస్యలను 24 గంటల్లో నెరవేర్చాం

- కాంగ్రెస్ పాలనకు ఇది నిదర్శనం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా కొల్లూరు కాలనీవాసుల సమస్యలను 24 గంటల్లో పరిష్కారించామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. కాలనీలో సుమారు 16 వేల కుటుంబాలు, 48 వేల జనాభా నివాసం ఉంటుందని తెలిపారు. ఆదివారం కొల్లూరు కాలనీవాసులతో మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్, ఖమ్మం ఎంపి రామసహాయం రఘురామ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, కౌన్సిలర్ భరత్‌తో కలిసి మంత్రి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొల్లూరు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. వారం రోజుల క్రితం ఇచ్చిన మాట ప్రకారం కాలనీ వాసుల చాలా సమస్యలను కొన్నింటిని పరిష్కరించామన్నారు. కాలనీలో సన్నబియ్యం తీసుకునే లబ్ధిదారుల కోసం రేషన్ దుకాణం, కాలనీ లోపలకి ఆర్‌టిసి బస్సులు వచ్చేలా ఏర్పాటు చేశామన్నారు. కాలనీవాసుల రక్షణ కోసం శాశ్వత పోలీస్ స్టేషన్ నిర్మాణం చేపట్టామన్నారు. అంతవరకు తాత్కాలిక పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గతంలోనే ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అత్యవసర కోసం రెండు అంబులెన్స్‌లను అందించామని తెలిపారు. కాలనీలో స్పీడ్ బ్రేకర్లు, సెంట్రల్ లైటింగ్ వెంటనే ఏర్పాటు చేస్తామనీ, శ్మశానవాటిక ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో అరులైన పేదలందరికీ గృహ జ్యోతి పథకం కింద 200 వరకు యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని చెప్పారు. వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ తీసుకునే విధంగా వచ్చే నెల నుంచి ఇక్కడే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదు

- మా వైపే జూబ్లీహిల్స్ ఓటర్లు : మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోయే అందరీ పార్టీ కాంగ్రెస్ వైపే నియోజకవర్గ ఓటర్లంతా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఆయన ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. అపార్ట్ మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల అసోసియేషన్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి గత కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు, చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టుల గురించి ఓటర్లకు వివరించారు. నగరాభివద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై సలహాలు సూచనలు స్వీకరించారు. తొమ్మిదేళ్ల పాలనలో బిఆర్ఎస్ పాలకులు నగరాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లను నిర్మించి మొత్తం నగరాన్ని అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకున్నారన్నారు. కానీ... క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి వేరని, ఇప్పటికీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని చాలా కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. రెండేళ్లలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారన్నారు. అయినా... తమ ఉనికిని కాపాడుకునేందుకు బిఆర్ఎస్, బిజెపి బురద జల్లే రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు.

విద్యా వలంటీర్లు అవసరం

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 వేల మంది మిగులు ఉపాధ్యాయులు ఉండగా..అదే సమయంలో అయిదు జిల్లాల్లో టీచర్ల కొరత ఉందని, ఆయా జిల్లాల్లో 1,428 మంది విద్యా వలంటీర్లు(అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు) అవసరమని పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. గద్వాల జిల్లాలో 244 మంది, నారాయణపేట 320, వికారాబాద్ 123, మేడ్చల్ 520, రంగారెడ్డి జిల్లాలో 221మంది చొప్పున మొత్తం 1,428 మంది విద్యా వలంటీర్ల కొరత ఉందని అధికారులు తేల్చారు. ఇతర గ్రామీణ జిల్లాలతోపాటు ఎపి నుంచి మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు కుటుంబాల వలస పెరుగుతుండటంతో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. మిగిలిన మూడు జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు డిప్యుటేషన్లు, స్పౌజ్ తదితర కేటగిరీల కింద బదిలీలు జరగడంతో టీచర్ల కొరత ఏర్పడింది. రెగ్యులర్ టీచర్లను నియమించడం ఇప్పటికిప్పుడు సాధ్యం కానందున తాత్కాలికంగా విద్యా వలంటీర్లను నియమించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఒక్కో విద్యా వాలంటీరుకు నెలకు రూ.15,600 చొప్పున గౌరవవేతనం చెల్లించాల్సి ఉంటుందని, మొత్తం రూ.13.37 కోట్లు అవసరమని అంచనా వేశారు.

మహారాజశ్రీ అమలాపురం సివిల్ జడ్జి
(సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A.NO. 678/2022 , 679/2022, 680/2022,
In
O.S .NO 217/2010

Between
దువ్వూరి శ్రీదేవి ... పిటీషనరు/వాది
To
సొంభట్ల కృష్ణమూర్తి & అదర్స్
... రెస్పాండెంట్స్/ప్రతివాదులు

R-10) M.V.S. రామం s/o లక్ష్మీ సుబ్బారావు D.No. 18-174, హనుమాన్ పేట, మల్కాజ్ గిరి, సికింద్రాబాద్-500047
R-14) అక్కిపెద్ది శ్రీలక్ష్మి w/o మురనిదర్, D.No. 8-174, హనుమాన్ పేట, మల్కాజ్ గిరి, సికింద్రాబాద్ - 500047.

ఇందలి పీటిషన్లు **(5వ రెస్పాండెంట్ మంగిపూడి వెంకటరత్నం)** మిమ్ములను వారసులుగా చేర్చుటకు వగైరా పరిహారములు నిమిత్తం పిటీషన్ దాఖలు చేయగా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ యొక్క పిటిషన్లు మీ హాజరు నిమిత్తమై **ది. 12-11-2025** నాటికి వాయిదా వేసినారనియు, కావున మీకు గల ఆక్షేపణలు ఏమైనా ఉన్న యెడల శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం 10-30 నిIIల లగాయితు హాజరై, తెలుపుకోవలసినదిగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వ్యుల రీత్యా తెలియజేయడమైనది.

N.S. N. Murthy
పిటిషనర్ తరపు అడ్వకేట్
అమలాపురం
సెల్:9441767978

అమలాపురం
09-11-2025

ప్రచారం సమాప్తం!

- మూగబోయిన మైకుల మోత, ప్రచార సందడి
- అమల్లోకి ఎన్నికల ఆంక్షలు.. రేపే పోలింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల హోరాహోరీ ప్రచారానికి ఆదివారం సాయంత్రం ఆరు గంటలతో తెరపడింది. దాంతో పార్టీల ప్రచార వాహనాల సందడి, నాయకుల ప్రసంగాలు, కార్యకర్తల నినాదాలతో మార్మోగిన వీధులు ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారాయి. ర్యాలీలు, రోడ్ షోలు ముగిశాయి. గడిచిన ఇరవై రోజులుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రతి బస్తీ, కాలనీల్లో అన్ని పార్టీల ముఖ్య నేతలు వివిధ రూపాల్లో తమ ఎన్నికల ప్రచారంతో హోరెత్తించాయి. ఇక ప్రచారానికి తెరపడటంతో ఎన్నికల ఆంక్షలు అమల్లోకి రాగా.. ఇక అందరి దృష్టి రేపటి పోలింగ్‌పైనే నిలిచింది. ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేయనుండగా, అభ్యర్థుల భవితవ్యం ఈ నెల 14న వెలువడనున్న ఓట్ల లెక్కింపుతో తేలనుంది.

అధికార, ప్రతిపక్షాల వ్యూహాలు

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి... .. చివరి రోజు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. అధికార కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని నినాదంగా చేసుకుని ఓటర్లను అభ్యర్థించింది. ముఖ్యంగా డివిజన్ల వారీగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖతో ఇతర మంత్రులు ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, స్థానిక నాయకులు, అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లతో ప్రచారాన్ని హోరెత్తించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను తానే తీసుకుంటానని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను లక్ష్యంగా చేసుకుని ప్రచారం సాగించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు.. తమ ప్రసంగాల్లో అధికార పార్టీపై విమర్శలు గుప్పించారు. కేటీఆర్ రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనతో రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. హరీశ్ రావు తండ్రి మరణించినప్పటికీ.. ప్రచార బాధ్యతల్లో కేటీఆర్‌కు అండగా నిలిచారు. బీజేపీ కూడా తన ప్రచారాన్ని ముమ్మరంగా సాగించింది. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను విమర్శిస్తూ.. వినూత్న రీతిలో ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నించింది. ఇందులో భాగంగా బైక్ ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలతో పాటు పలు వినూత్న కార్యక్రమాలను చేపట్టింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఇతర సీనియర్ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాన పార్టీలన్నీ ఈ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ప్రచారం సాధారణ ఎన్నికల వాతావరణాన్ని తలపించింది. ఇప్పుడు అందరి చూపు ఓటరు నాడీపైనే నిలిచింది. రేపు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ నిర్ణయాన్ని వెల్లడించనున్నారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపితో పాటు మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన సంగతి తెలిసిందే.

సర్వేల గందరగోళం

వివిధ సంస్థలు విడుదల చేసిన ఒపీనియన్ పోల్స్ మిశ్రమ ఫలితాలను వెల్లడిస్తూ రాజకీయ గందరగోళాన్ని మరింత పెంచాయి. సైదులు సర్వే, "మూడ్ ఫర్ ది పబ్లిక్ అండ్ పీపుల్" సర్వే, లోక్ పోల్ సర్వే వంటివి కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పాయి. నవీన్ యాదవ్ తన సామాజిక సేవతో 50.65శాతం ఓట్లు సాధించవచ్చని ఒక సర్వే అంచనా వేసింది. మరోవైపు చాణక్య, కేకే, శాస్ వంటి సర్వేలు బీఆర్ఎస్ పార్టీకి విజయావకాశాలు ఉన్నాయని అంచనా వేశాయి. ముఖ్యంగా కేకే సర్వే బీఆర్ఎస్‌కు 55శాతం ఓట్లు, కాంగ్రెస్‌కు 37శాతం ఓట్లు వస్తాయని పేర్కొంది.

పార్టీలకు ప్రతిష్టాత్మకం..

ఈ ఉపఎన్నిక ఫలితం అధికార, ప్రతిపక్షాలకు రాజకీయంగా కీలకంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుకు ఈ ఎన్నికను ఒక రెఫరెండంగా భావిస్తున్నారు. గెలుపు ద్వారా హైదరాబాద్‌లో పార్టీ పట్టును నిరూపించుకోవాలని, తన నాయకత్వాన్ని మరింత బలపరుచుకోవాలని ఆయన భావిస్తున్నారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీ శ్రేణుల్లో నైతిక స్థైర్యాన్ని నింపేందుకు ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడం బిఆర్ఎస్‌కు అత్యంత అవసరం. ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా తమను తాము నిరూపించుకోవాలని బిజెపి ప్రయత్నిస్తోంది. భిన్నమైన సర్వేలు, పార్టీల మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఓటరు ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది నవంబర్ 14న ఓట్ల లెక్కింపు తర్వాతే స్పష్టమవుతుంది.

వినియోగదారునికి రూ.70లక్షలు చెల్లించాలి

- బీమా కంపెనీకి వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వినియోగదారునికి రావాల్సిన బీమాను చెల్లించాల్సిందేనని బీమా కంపెనీని నల్గొండ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆదేశించింది. బాధితుని కథనం ప్రకారం.. చౌటుప్పల్ మండలం దర్మోజిగూడెంలో ఉన్న ప్రసిద్ధ అగ్రి సైన్సెస్ కంపెనీ నీటిలో కరిగే ఎరువులను తయారుచేస్తుంది. బాధిత సంస్థ బ్యాంకు నుంచి ఓ కంపెనీ ద్వారా బీమా చేయించింది. 2021లో సంస్థ షెడ్‌లో అగ్ని ప్రమాదం జరిగి యంత్రాలు కాలిపోయాయి. అయితే, బీమా కంపెనీ, బ్యాంకు అధికారులు పలు సాకులు చెప్పి బీమా ఇవ్వలేదు. దీంతో బాధితుడు ఫోరంను ఆశ్రయించాడు. ఇరు పక్షాల వాదనలు విన్న కమిషన్ తుది తీర్పు వెలువరించింది.బాదితుని వాదనతో ఏకీభవిస్తూ బీమా సంస్థ రూ.70.22లక్షలు చెల్లించాలని ఆదేశించింది. సేవాలోపానికి పాల్పడిన బీమా కంపెనీ, బ్యాంకు అధికారులు రూ.5లక్షలు చొప్పున బాధిత సంస్థకు చెల్లించాలని స్పష్టంచేసింది. కేసు ఖర్చులు రూ.50వేలు చెల్లించాలని ఆదేశించింది.

నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి

- జూబ్లీహిల్స్ ఓటర్లకు డిప్యూటీ సిఎం భట్టి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం యూసఫ్‌గూడ పార్టీ కార్యాలయంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, శ్రీహరి ముదిరాజ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. "నవీన్ యాదవ్ సేవకుడు. పదవి లేకుండానే అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తున్నాడు. బలహీన వర్గాల వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. రెండేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.6 లక్షల కోట్లు ఖర్చు చేసింది. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. జూబ్లీహిల్స్ అన్ని రంగాల్లో మరింతంగా అభివృద్ధి చెందాలంటే నవీన్‌ను గెలిపించండి" అని భట్టి ఓటర్లను కోరారు. పదేండ్లు మంత్రిగా పని చేసిన హరీశ్‌రావు మతి భ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ 30 వేల నుంచి 50 వేల ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

జల్సాల కోసం దారిదోపిడీలు, మోసాలు

- ఐదుగురు నిందితులు అరెస్ట్
- సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం : కాటారం డిఎస్‌పి సూర్యనారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు, మోసాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యులు గల ఘరానా దొంగల ముఠాను జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3.48 లక్షల నగదు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాటారం డిఎస్‌పి కార్యాలయంలో కేసు వివరాలను డీఎస్పీ ఏ. సూర్యనారాయణ ఆదివారం వెల్లడించారు. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన రాజు సోలంకి, మహారాష్ట్రలోని కారేగావ్‌కు చెందిన శాంతి విజయ సోలంకి, స్వప్న ఈశ్వర్ సోలంకి, నాగపూర్‌కు చెందిన పుణ్య బాల చందర్ రాథోడ్, పుణ్య రాథోడ్.. జల్సాలకు అలవాటుపడి అడ్డదారిలో డబ్బులు సంపాదించేందుకు దొంగలుగా మారారు.

తక్కువ ధరకు బంగారం ఇస్తామని నమ్మబలికి కాటారం కేంద్రంలోని ఓ సూపర్ మార్కెట్ యజమానిని ఆర్థికంగా మోసం చేయడం, నస్తురుపల్లి వద్ద ఓ వ్యక్తిపై భౌతిక దాడి చేసి దారి దోపిడీకి పాల్పడ్డారు. వీటిపై ఫిర్యాదు రావడంతో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. చింతకాని గ్రామ శివారులో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు మగ, ముగ్గురు మహిళలు సహా ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. కేసును ఛేదించిన కాటారం సీఐ ఈపూరి నాగార్జున రావు, ఎస్ఐలు ఎకుల శ్రీనివాస్, జక్కుల మహేష్, హెడ్ కానిస్టేబుల్ ప్రవీణ్, కానిస్టేబుళ్లు రాజు, నాగరాజు, రామారావు జంపన్న, ఐటీ కోర్ వేణును ఎస్పీ అభినందించారు.

ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగుతారా..?

- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దగ్గరివాళ్లు చెప్పినా వినే పరిస్థితిలో సిఎం రేవంత్‌రెడ్డి లేరని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ప్రశ్నిస్తే పాలన మీరే చేయండంటూ ఎదురుదాడికి దిగుతున్నారని, అలాంటప్పుడు అధికారం నుంచి దిగిపోవాలని అన్నారు.ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి కంటే ఎవరైనా బాగానే పాలన చేస్తారని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో నిర్మాణ రంగాన్ని ఖతం చేశారని విమర్శించారు. బయటివాళ్లకు అధికారం ఇవ్వాల్సిన అవసరం లేదని, పార్టీలో ఉన్న వ్యక్తులకే ఇవ్వొచ్చని వ్యాఖ్యానించారు. నిన్నటిదాకా భట్టి విక్రమార్క మాత్రమే సిఎం రేసులో ఉండేవారని, ఇప్పుడు టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కూడా పోటీలో ఉన్నారని అన్నారు.

ఆదివారం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. " సర్పంచ్ ఎన్నికలకు తిరిగినట్లు రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ సందుసందుకు తిరిగారు. ప్రెస్‌క్లబ్ పబ్‌లా కనిపిస్తోందని.. స్టార్ హోటల్‌లో మీట్ ది ప్రెస్ పెట్టారు. రూ.3 వేల కోట్లతో ఉస్మానియా, 100 ఎకరాల్లో హైకోర్టు నిర్మాణం, ఆర్టీసీకి రూ.7వేల కోట్ల లాభం తెచ్చినట్లు చెప్పుకొన్నారు. 20వేల నోటిఫికేషన్లు ఇచ్చి 60 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. అసలు ఒక్క నోటిఫికేషన్ అయినా వచ్చిందా? నిరుద్యోగులు జూబ్లీహిల్స్‌లో నామినేషన్ వేసి కాంగ్రెస్‌ను ఓడించాలని తిరుగుతున్నారు. పీజేఆర్‌ను చంపిందే కాంగ్రెస్ పార్టీ. రాజకీయాల్లో ఆయన కుటుంబానికి స్థానం లేకుండా చేసింది రేవంత్ రెడ్డి. 2004 నుంచి 2014 వరకు స్వర?యుగం అన్నారు. మీ జిల్లాలో కూడా ఆకలిచావులు ఉన్నాయి కదా" అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

ప్రభుత్వ విధానాలపై పోరుకు సిద్ధం కండి

- కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి : పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరుకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోతి రాంపూర్‌లోని కామ్రేడ్ జేఎల్ నరసింహారెడ్డినగర్‌లో సీఐటీయూ 11వ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు గీట్ల ముకుందరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు పూర్తిగా అనుకూలంగా మారిపోయిందన్నారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేవలం నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి, కార్మికుల హక్కులను పూర్తిగా నీరు గార్చిందని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయిస్తూ పెండింగ్‌లో ఉన్న జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో సీఐటీయూ మూడేండ్లలో కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి, కొత్త రంగాలకు విస్తరించిందని అభినందించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మూడేండ్లలో జిల్లాలో నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాలపై నివేదికను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా ఆశా కార్యకర్తలు, బిల్డింగ్, గ్రానైట్, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ, రైస్ మిల్లు కార్మికుల సమస్యలపై చేసిన కృషిని వివరించారు. భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ రమ, కార్యదర్శి జె వెంకటేష్, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాలువల స్వామి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యు. శ్రీనివాస్, జనగాం రాజమల్లు, గుడికందుల సత్యం, సహాయ కార్యదర్శులు కొప్పుల శంకర్, కోశాధికారి రాజేశం, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి నాయకుల్లో విభేదాలు లేవు... అదంతా కాంగ్రెస్ ప్రచారమే

- బిజెపి అధ్యక్షులు రామచందర్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి నాయకుల మధ్య ఎలాంటి విభేదాలు లేవనీ, అదంతా కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారమేనని బిజెపి అధ్యక్షులు రామచందర్‌రావు చెప్పారు. ఉపఎన్నికల ప్రచారంలో తమ పార్టీ నేతలు పాల్గొనడం లేదంటూ సోషల్ మీడియాలో కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, తమ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ కుట్రలకు ప్రజలే సమాధానం చెబుతారని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలు బీజేపీని గెలిపించి న్యాయబద్ధమైన తీర్పు ఇస్తారనే పూర్తి నమ్మకముందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి విజయం కోసం నిరంతరంగా శ్రమించిన ప్రతి కార్యకర్తకు పార్టీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చెప్పి ఓట్లు అడక్కుండా మతాల పేరిట ఓట్లు అడిగిందని ఆరోపించారు. ఒకవైపు బిజెపిని 'మతోన్మాద పార్టీ' అంటూ ముద్ర వేస్తూ, మరోవైపు కాంగ్రెస్సే మతం పేరుతో ఓట్లు అడుగుతున్నదని విమర్శించారు. 'క్రిస్టియన్లు అందరూ కాంగ్రెస్‌కే ఓటేయాలి. బిజెపికి కాదు' అంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రచారం అనడాన్ని ఆయన తప్పుపట్టారు. 'కాంగ్రెస్ అంటేనే ముస్లిం. ముస్లిం అంటేనే కాంగ్రెస్' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మిగతా వర్గాల ఓట్లు కాంగ్రెస్‌కు అవసరం లేదా? అని ప్రశ్నించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీపై సీఎం విమర్శలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.12లక్షల కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా రాష్ట్రంలో ఎరువుల కొరత, ఉద్యోగులకు వేతనాల ఆలస్యం, విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఇంత తక్కువ కాలంలో ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వం మరొకటి లేదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడితే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో అవినీతికి తెరలేపుతున్నదని ఆరోపించారు. మూసీ పునరుద్ధరణకు ఎలాంటి రోడ్‌మ్యాప్ ఉంది? డిపిఆర్ లేకుండా ప్రాజెక్టు ఖర్చులు ఎలా అంచనా వేశారు? అని ఆయన ప్రశ్నించారు.

ఘనంగా ముగిసిన పుదుచ్చేరి ప్రపంచ చరిత్ర మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో జరుగుతున్న పుదుచ్చేరి 3వ, ప్రపంచ చరిత్ర మహాసభ ఆదివారం ముగిసాయి. ముగింపు సమావేశానికి ఉస్మానియా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొ.కిషన్ రావు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సిఇఒ ఈమని.శివ నాగిరెడ్డి, పుదుచ్చేరి వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రొ.అరవింద్ కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రొ. సందీప్ కుమార్ దాసరి, డా.సిహెచ్ సైదులు, తలారి.శ్రీనివాసరావు, పలువురు చరిత్ర కారులు, పిహెచ్‌డి విద్యార్థులు,ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం నాలుగు షేషన్స్‌లాలో 75 మంది పరిశోధన పత్రాలు సమర్పించారు. అనంతరం పుదుచ్చేరి హిస్టరీ కాంగ్రెస్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.

మెడికల్ యూనియన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 18న సంగారెడ్డిలో జరగనున్న మెడికల్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభల్లో వైద్య శాఖలో ఉన్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్టు తెలిపారు. ప్రధానంగా పర్మినెంట్ కాంట్రాక్టు ఉద్యోగులందరికీ వెంటనే పీఆర్సీ ఇవ్వాలని, డీఏ బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీతాలు పెండింగ్‌లో పెట్టకుండా ఏ నెలది ఆ నెల ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలని, 104, 108, 102 ఆరోగ్యశ్రీ మిత్రులకు, టీ సాక్స్ ఇతర స్కీముల్లో పనిచేసే వాళ్లందరికీ వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అర్బన్ హెల్త్ సెంటర్ల ఉద్యోగులకు జీతాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేసే పేషంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్ తదితరులకు కనీస వేతనం రూ.26,000 చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం రాబోయే కాలంలో అనేక ఉద్యమాలు చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. యాదగిరి మాట్లాడుతూ.. మహాసభల జయప్రదానికి అవసరమైన ఏర్పాట్లన్నీ చేస్తున్నట్టు చెప్పారు. ఆహ్వాన సంఘం చీఫ్ పాటర్న్ బి.మల్లేష్, జి. సాయిలు మాట్లాడుతూ.. జిల్లాలోని కార్మిక వర్గం సహాయసహకారాలతో మహాసభలను జయప్రదం చేస్తామన్నారు. సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన జిల్లా అని, ఈ జిల్లాలో యూనియన్ రాష్ట్ర మహాసభలు జరగడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం కోశాధికారి మహిపాల్, నాయకులు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆట ఆగింది... ఉపాధి కూలింది

- మూతపడుతున్న థియేటర్లు, వీధిన పడుతున్న కార్మికులు
- కరోనాలో మూతపడి నేటికీ తెరుచుకోని థియేటర్లు
- వీధిన పడిన వందలాది కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంత మల్టీకలర్‌లో సినిమా రంగం ఎదిగినా దాన్ని ఆధారంగా చేసుకొని జీవనం సాగించే కళాకారుల నుంచి కార్మికుల దాక జీవన పరిస్థితులు చిధ్రమయ్యాయి. ఒక చేత్తో డొక్కు సైకిల్ పట్టుకొని మరో చేత్తో పొడవాటి నిచ్చెన పైన ఉంచుకొని ఈగలు ముసిరిన లై ని వెంటబెట్టుకొని రంగు రంగు పోస్టర్లు వేసే పోస్టర్ బాయ్ నుంచి పోస్టర్ బాయ్‌నుంచి ప్రొప్రయిటర్ దాక.. పాన్ షాపుల నుంచి పల్లీ బట్టీలను అమ్మే వారిదాక.. ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. కరోనా వచ్చిన తర్వాత మనిషి జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. సినిమాలను థియేటర్లలో చూడటంపై ఆసక్తి తగ్గింది. దాంతో ఆర్థికభారంతో రాష్ట్రవ్యాప్తంగా సగానికి పైగా సినిమా థియేటర్లు మూతపడ్డాయి. కొత్త సినిమా వచ్చిందంటే చాలు చిన్నా పెద్దా తేడా లేకుండా ఉదయం షో మొదలుకొని రాత్రి రెండో ఆట దాక థియేటర్ల ముందు బారులు తీరి టికెట్ల కోసం ఎగబాకేవారు. కొత్త సినిమా విడుదలయిన మొదటి రోజయితే టికెట్ల దగ్గర యుద్ధం తలపించేది. వారం రోజుల ముందే టికెట్లు అమ్మేవారు. మరికొందరయితే.. రూ. 20ల టికెట్లను రూ.200ల వరకు బ్లాక్‌లో కొని మరీ సినిమా చూసేవారు. కానీ ఇప్పుడాపరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వం వీరిని గుర్తించి వీరి జీవనోపాధి కోసం ఆర్థిక సహాయం అందజేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రతి గ్రామంలో ఆధునిక టీవీలు అందుబాటులోకి వచ్చాయి. ఈరోజు వచ్చిన సినిమాను అదే రోజు టీవీలో చేసే అవకాశాలూ వచ్చాయి. ఎక్కడ ఉన్నా.. తన దగ్గర ఉన్న సెల్‌ఫోన్‌లో సైతం సినిమా చూసే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా మారిన జీవన శైలి వల్ల ఒక రోజు రెండున్నర గంటలు సినిమా చూసే పరిస్థితులు లేవు. పెరిగిన పోటీతత్వం, ఆర్థిక అవసరాలు తదితర అంశాలు ప్రజలను థియేటర్లకు దూరం చేశాయి. ఈ పరిస్థితుల్లోనే ఆర్థిక భారం మోయలేక అనేక థియేటర్లు మూత పడుతున్నాయి.

జిల్లాలో ఉన్న థియేటర్లు మూతపడటంతో అందులో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి ఉపాధి లేకుండా పోయింది. ఒక థియేటర్ పరిధిలో పోస్టర్ బాయ్స్ ఇద్దరు, సైకిల్, బైక్, కారు స్టాండ్‌లో ఆరు మంది, ఇద్దరు వాచ్‌మెన్లు, క్లీనింగ్‌కు నలుగురు, సాంకేతిక నిపుణులు 5 మంది, ఆపరేటర్లు ఇద్దరు, టికెట్లు అమ్మేవారు నలుగురు, పాన్‌డబ్బా, టిఫిన్, పల్లీలు, బటానీలు అమ్మేవారు, వీరితోపాటు శీతల పానీయాలు.. ఇలా ఒక్కో టాకీస్ పరిధిలో సుమారు 50 కుటుంబాలు జీవిస్తుంటాయి. అరకొర ఆదాయం ఉన్నా గత్యంతరం లేక జీవనం సాగించేవారికి థియేటర్లు మూత పడుతుండటంతో జీవనోపాది కోల్పోతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 110 థియేటర్లు ఉంటే 5500 కుటుంబాలు జీవనం సాగిస్తుంటారు. వీరిలో నేడు 75శాతానికి పైగానే జీవనోపాధి కోల్పోయారు.

ఉపాధి లేక..

ఉపాధి లేక అనేక మంది కార్మికులు ఇతర రంగాల్లో పనిచేయడానికి వెళ్తున్నారు. ప్రధానంగా నిర్మాణ రంగం, హోటళ్లు, బట్టల షాపుల్లో పనిచేస్తున్నారు. అలాగే, ఇప్పుడు నడుస్తున్న శాటిలైట్ ప్రసారంతో ఇక్కడ సాంకేతిక నిపుణుల అవసరం లేదు. దాంతో ఇప్పుడు నడుస్తున్న థియేటర్లలో సైతం వీరి అవసరం లేకుండా పోయింది. మూతపడ్డ థియేటర్లతో పాటు నడుస్తున్న థియేటర్లలో సైతం సాంకేతిక నిపుణుల అవసరం లేకపోవడంతో వీరు సైతం రోడ్డున పడ్డారు. శాటిలైట్ ప్రసారం కావడంతో అనేక మంది జీవన విధానంపై తీవ్ర ప్రభావం పడుతుంది.

పని లేకుండా పోయింది : శంకర్, నాగర్ కర్నూల్

నాగర్ కర్నూల్ పట్టణంలోని రవీంద్ర సినిమా థియేటర్లో పది సంవత్సరాలు టికెట్ల బుకింగ్‌లో పనిచేశాను. ఈ థియేటర్ మూతపడిన తర్వాత నాకు పని లేకుండా పోయింది. బయట ఏ పని చేయలేకపోతున్నాను.

ఉపాధి కోసం బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించాలి : పొదిల రామయ్య, సిఐటియు జిల్లా నాయకులు నాగర్ కర్నూల్

జిల్లాలో 20 థియేటర్ల దాకా మూతపడ్డాయి. సుమారు వెయ్యి మంది ఉద్యోగులు వీధిన పడ్డారు. నేడు ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారు. వీరికి ప్రభుత్వం ద్వారా రుణమందిస్తే చిన్న చిన్న వృత్తులు చేసుకొని జీవిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణ సదుపాయం అందించాలి.

ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను వెంటనే సమావేశపరచాలి

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ని (ఐఎలిసి) వెంటనే సమావేశపరచాలని, కార్మిక వర్గానికి వ్యతిరేకమైన 'శ్రమశక్తి నీతి 2025' నూతన లేబర్ పాలసీని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఐలా భవన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో 'నూతన లేబర్ పాలసీ (శ్రమశక్తి నీతి - 2025) - కార్మిక వర్గంపై దాడి' అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దొడ్డిదారిన లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకే నూతన లేబర్ పాలసీ శ్రమశక్తి నీతి - 2025ను తెస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా కార్మిక వ్యతిరేకమైందని అన్నారు. కార్మిక చట్టాలు ఉన్నప్పుడే వాటి అమలు కాకుండా ఉల్లంఘన జరుగుతున్నాయన్నారు. ఇక శ్రమ శక్తి నీతి - 2025 పేరుతో కార్మికులకు హక్కులు లేకుండా చేసి వారిని కట్టు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతుందని విమర్శించారు. 26 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందని తెలిపారు. కార్మికులకు వ్యతిరేకమైన నూతన లేబర్ పాలసీని కార్మిక వర్గం ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌లో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, కిర్బి యూనియన్ జనరల్ సెక్రెటరీ వివిఎస్ రాజు, యూనియన్ నాయకులు మల్లేష్, లఖన్, తలారి శ్రీనివాస్, శ్యాంబాబు, రాజిరెడ్డి బిలాల్, జైపాల్, మహేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం అండతో డ్రగ్స్ ముఠా : బండి సంజయ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పాతబస్తీలో ఎంఐఎం అండదండలతో డ్రగ్స్‌ముఠా చెలరేగిపోతున్నదని కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. ఆ ముఠాలకు మైనర్ పిల్లలు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రాకెట్ హిందూ మైనర్ అమ్మాయిలను లక్ష్యంగా చేసుకుని కిడ్నాప్, లైంగికదాడులకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కనీసం విచారణ జరపడం లేదని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన డ్రగ్స్ ముఠా అంతు చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్ర బలగాలను పాతబస్తీలో మోహరించాల్సి వస్తుందన్నారు.